క్లుప్తంగా

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం ప్యారానగర్‌లోని సల్మాన్‌ఫార్సీ మసీదులో రంజాన్ మాసం సందర్భంగా మొదటి రోజు ఇఫ్తార్ విందు మంగళవారం సాయంత్రం జరిగింది. ముస్లింలంతా పాల్గొని ముందుగా ప్రార్థనలు చేశారు. మసీదుల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

ఘనంగా బాట గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో బాట గంగమ్మ

మదనపల్లె సిటీ : స్థానిక బుగ్గకాల్వలోని బాట గంగమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జాతర పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు దీలు,బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కేజీబీవీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కేవీపల్లె : 2024–25 విద్యా సంవత్సరానికి వగళ్ల కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో ప్రవేశాలకు ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రావణి ఓ ప్రకటనలో కోరారు. 6, 11వ తరగతుల్లో ప్రవేశాల తోపాటు 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 11 తేదీ వరకు గడువు ఉన్నట్లు పేర్కొన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత

మదనపల్లె సిటీ : స్థానిక నీరుగట్టువారిపల్లె, మాయబజార్‌లోని వివేకానంద మున్సిపల్ ఉన్నత



విద్యాసామగ్రిని అందజేస్తున్న హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్

పాఠశాలలో మంగళవారం యూత్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు ఉచితంగా పరీక్షా సామగ్రిని అందజేశారు. యూత్ కరాటే క్లబ్ వ్యవస్థాపకులు ఏఆర్ సురేష్ మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎగ్జామ్‌ప్యాడ్స్, జామెంట్రీ బాక్సులు, పెన్నులను అందజేశారు. హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్, ఏసీటీఓ నాగేంద్ర, రామమూర్తి, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆరోగ్య శిబిరం

పీలేరు : నేడు స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం, వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గౌరీశంకర్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3.00 గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేయడం తోపాటు మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు.

బి.రజనికి డాక్టరేట్



కలికిరి : కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.రజనీకి జేఎన్టీయూ అనంతపురం యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, ఎస్వీయూ విశ్రాంత ప్రొఫెసర్ ఏవీ నరసింహరావు పర్యవేక్షణలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో 'స్ట్రెంత్ అండ్ డూరబిలిటి స్టడీస్ ఆన్ జియోపాలిమర్ అండ్ స్టీల్ ఫైబర్ రైన్‌ఫోర్స్‌డ్ జియోపాలిమర్ కాంక్రీట్ యూసింగ్ ఫ్లైయాష్ అండ్ జీజీబీఎస్'పై ఆమె చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది.

అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికే వైఎస్సార్ చేయూత

- సీఎం జగన్ మహిళల పక్షపాతి
- టీడీపీ, జనసేన రాబందుల చేతుల్లో గీతాంజలి బలి
- మంచి జరిగి ఉంటే జగనన్నను ఆశీర్వదించండి
- నాలుగోవిడత నిధుల పంపిణీలో సమన్వయకర్త నిసార్‌అహ్మద్



మదనపల్లె: వైఎస్సార్ చేయూత చెక్కు పంపిణీ చేస్తున్న నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి,



రామసముద్రం సభకు హాజరైన మహిళలు

మదనపల్లె : 'మహిళ బాగుంటే... కుటుంబం బాగుంటుంది. కుటుంబం బాగుంటే ప్రాంతం బాగుంటుంది. ప్రాంతం బాగుంటే రాష్ట్రం బాగుంటంది' అని నమ్మిన సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచీ అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి అనేకపథకాలు అమలు చేస్తున్నారని నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌లో మదనపల్లె మున్సిపాలిటీ, మండలం, మధ్యాహ్నం రామసముద్రం మండలంలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీ మహిళల జీవనోపాధుల నిమిత్తం అందజేసే వైఎస్సార్ చేయూత నాలుగో విడత నిధులను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఎంపీపీలు రెడ్డెమ్మ, కుసుమకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీలు ఉదయ్‌కుమార్, సీహెచ్.రామచంద్రారెడ్డి, వైస్‌చైర్మన్లు జింకాచలపతి, నూర్‌ఆజంలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. సమావేశంలో భాగంగా.. మొదట మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ చేయూత పథకంలోని మహిళలను ఉద్దేశించి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పంపిన సందేశాన్ని అక్కచెల్లెమ్మలకు చదివి వినిపించారు. టీడీపీ, జనసేన సోషల్ మీడియా రాబందుల వికృతచేష్టలతో బీసీ మహిళ గీతాంజలి నిండుప్రాణాన్ని బలితీసుకున్న ఘటనపై సభలో రెండునిమిషాలు మౌనం పాటించారు. తర్వాత మహిళలను ఉద్దేశించి నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ చేయూత పథకం కింద ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున వరుసగా నాలుగేళ్లు రూ.75,000 లబ్ధిని అందించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అక్కచెల్లెమ్మల కుటుంబానికి మంచి జరగాలన్న ఉద్దేశంతో చెప్పిన ప్రకారం హామీ నిలబెట్టుకున్నారు. సీఎం జగన్ మహిళా పక్షపాతి కనుకనే ప్రతి పథకంలోనూ వారిని భాగస్వామ్యులు చేస్తూ, వారి మీదే నమ్మకం పెట్టుకున్నారన్నారు. జగనన్నకు ప్రతి మహిళా స్టార్ క్యాంపెయినర్‌గా మారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చేలా సహకరించాలన్నారు. కుప్పంలో చంద్రబాబు చేయలేని అభివృద్ధిని, జగనన్న చేసి చూపాడని, అందుకే 175కి175 సీట్లు గెలుస్తామనే ధీమాతో ఉన్నామన్నారు. మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..పిల్లల భవిష్యత్తు కోసం, పేదల సంక్షేమం కోసం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా మదనపల్లె మున్సిపాలిటీ, రామసముద్రం మండలాల మహిళలకు మెగా చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, సాయిప్రసాద్‌రెడ్డి, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారధి, మండల కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, నందకుమార్, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, భాస్కర్‌గౌడ్, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు, వేణుగోపాల్, ప్రకాష్, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ప్లానుకు రూ.13వేలా ?

- లంచం అడిగితే ఫిర్యాదు చేయండి
- కమిషనర్ మనోహర్

బి.కొత్తకోట : ఒక ఇంటిప్లానుకు రూ.13 వేలు చెల్లించామని చెప్పిన ఓ మహిళ మాటలు విని నగర పంచాయతీ కమిషనర్ పీఆర్.మనోహర్ అవాక్కయ్యారు. టౌన్‌ప్లానింగ్ విభాగంపై వస్తున్న అవినీతి ఆరోపణలకు చెక్ పెట్టాలని కమిషనర్ కొంతకాలంగా నేరుగా దరఖాస్తు దారులతోనే మాట్లాడి ఎవరికైనా డబ్బు ఇచ్చారా, లంచం అడిగారా అని ఆరా తీశాకే ఇంటిప్లాన్లకు అనుమతి ఇస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక సంతబజారుకు చెందిన ఓ మహిళ ఇంటిప్లానుకు దరఖాస్తు చేసుకుంది. దీనిపై ఆమె నుంచి ఎవరైనా లంచం తీసుకున్నారా అని తెలుసుకునేందుకు కార్యాలయానికి రప్పించారు. ఆమె ఎవరికి డబ్బు ఇవ్వలేదని, ప్లానుకు రూ.13వేలు తీసుకున్నారని చెప్పడంతో ఆశ్చర్యపోయారు. ఇకపై ఎవరైనా ప్లానుకు పెద్ద మొత్తంలో డబ్బు అడిగితే ఇవ్వొద్దని, కేవలం ప్లానుకు ఎంత ఫీజు అవుతుందో అంతే చెల్లించాలని సూచించారు. ప్లాన్లు వేయించే వారు నగర పంచాయతీ ఉద్యోగులు కారని, ప్రైవేటు వ్యక్తులని స్పష్టం చేశారు. నగర పంచాయతీ ఉద్యోగులు ఎవరైనా ప్లాను అనుమతి కోసం డబ్బు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై బాధితులు నేరుగా తనకు ఫిర్యాదు చేయొచ్చని కోరారు.

తలనీలాల సేకరణకు వేలం

రూ.18.40 లక్షల ఆదాయం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మకొండ ఆలయానికి తలనీలాల వేలం ద్వారా రూ. 18.40 లక్షల ఆదాయం సమకూరింది. మంగళవారం ఈవో కార్యాలయం వద్ద భక్తులు సమర్పించే తలనీలాలను సేకరించుకొనే హక్కు కోసం వేలం నిర్వహించారు. దేవదాయశాఖ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో వేలం ప్రారంభించారు. ఐదుగురు ఒక్కొక్కరు రూ.5 లక్షల చొప్పున డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు. సీల్డ్‌టెండర్ ద్వారా రూ.18,11,555లకు టెండర్ దాఖలు చేశారు. బహిరంగ వేలం ద్వారా వైఎస్సార్‌జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన చెన్నకేశవ అనే వ్యక్తి రూ. 18.40 లక్షలు హెచ్చుపాట పాడి కాంట్రాక్టు దక్కించుకొన్నాడు. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని వాల్మీకిపురం ఇండియన్ బ్యాంకులో డిపాజిట్టు చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఈవో మంజులలు తెలిపారు.

ఇంటి ముంగిటకే వైద్యసేవలు

– ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



విలేజ్‌క్లినిక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

తంబళ్లపల్లె : గాంధీకన్న కలలను నిజంచేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రజల ఇంటి ముంగిటకే వైద్యసేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మండలంలోని గుండ్లపల్లెలో సుమారు రూ.21.3 లక్షల అంచనాతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్‌క్లినిక్ భవనాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట వేసి అన్ని రకాల రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. గ్రామీణ నిరుపేదలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జగనన్న సురక్ష, నాడు–నేడుతో ఆసుపత్రులను అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోమారు పార్టీని అత్యధికంగా మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రజలను చైతన్యపరిచి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను సీయంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమములో ఎంపీపీ అనసూయమ్మ,సర్పంచు మౌలాలి, స్థానిక నాయకులు అప్పళనాయుడు, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎరుకులరెడ్డి, బాషా వెంకట్రమణ, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి



వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ లోకవర్ధన్

కేవీపల్లె : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరం లాంటిదని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వగళ్ల గ్రామ సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్య శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గజ్జెల శృతి, నాయకులు రామకొండారెడ్డి, పాత్తపు సతీష్‌రెడ్డి, జయరామచంద్రయ్య, లక్ష్మీదేవి, వెంకటసిద్ధులు, రఘునాథరెడ్డి, గజ్జెల శీన్‌రెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం : జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. మంగళవారం మండలంలోని కూరపర్తిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని తనిఖీ చేశారు. అనంతరం చింతపర్తి వైద్యులు ప్రజలను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీవిద్య, హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ, సూపర్‌వైజర్ సుధాకర్, భానుబి పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి : జిల్లాలోని మహాత్మా జ్యోతిభాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ప్రిన్సిపాల్ వై.సోమశేఖర్ తెలిపారు. ఐదవ తరగతిలో ప్రవేశానికి బాలికలకు కలికిరి, పీలేరు, నందులూరు పాఠశాలల్లో 80 సీట్లు వంతున, బాలురకు అంగళ్ళు పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి బాలికలకు నందలూరు జూనియర్ కళాశాలలో ఎంపీసీ–60, బైపీసీ–40, సీఈసీ–40 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడానికి ఈ నెల 31వ తేదీ ఆఖరు గడువు కాగా, ఏప్రిల్ 13న ఇంటర్మీడియట్, 27న ఐదవ తరగతి అభ్యర్థులకు ప్రవేశ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 900015637, 9866559605 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

డిజిటల్ స్క్రీన్‌తో వైఎస్సార్‌సీపీ ప్రచార రథం



డిజిటల్ స్క్రీన్ ప్రచార రథం

పీలేరు రూరల్ : డిజిటల్ స్క్రీన్ ప్రచార రథం ద్వారా వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం చేస్తూ ఓ పార్టీ యువ నాయకుడు తన అభిమానాన్ని చాటుకున్నాడు. పీలేరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటరీ యువజన విభాగం కన్వీనర్ ఎం.చైతన్యరెడ్డి వినూత్న రీతిలో పార్టీ ప్రచారం చేయాలని భావించారు. అందుకు తగ్గట్లుగా డిజటల్ స్క్రీన్ ప్రచారం రథంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించడం తోపాటు రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డిని, పీలేరు ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని గెలిపించాలని నియోజకవర్గంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. అలాగే పీలేరు పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తోపాటు ఎంపీ, ఎమ్మెల్యేల ఫోటోలతో కూడిన భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు.

గుర్రంకొండలో పోషణ్‌పక్వాడ్ ఉత్సవాలు

గుర్రంకొండ : మండల కేంద్రమైంలో పోషణ్ పక్వాడ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈనెల 9 నుంచి 19 వరకు ఉత్సవాలు నిర్వహిస్తారు. మంగళవారం స్థానిక కొత్తపేట, సంతవీధి, నబీకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహాలక్ష్మీ మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు బాలబాలికలందర్నీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. ప్రభుత్వం వీరికి మంచి విద్య తోపాటు పోషకాహారం ఉచితంగా అందిస్తుందన్నారు. అవకాశాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాణి, పద్మజ, చిట్టి, రేష్మ, పద్మలతలు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



ఎంఈఓ హేమలతను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రామసముద్రం : రామసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ హేమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, మండల అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ మహిళలు గొప్పతనాన్ని తెలియజేశారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తూ ఉద్యోగ బాధ్యతలు, మరోవైపు కటుంబ బాధ్యతలు మోస్తూ ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రమాదేవి, యూటీఎఫ్ నాయకురాలు హేమలత మాట్లాడుతూ మహిళా అభ్యుదయానికి కృషి చేయాలని కోరారు. మండల విద్యాశాఖాధికారి హేమలతను, ఉపాధ్యాయులను సన్మానించారు. అలాగే కెజిబివి పాఠశాల ఎస్‌వో మస్తాబి, నూర్జహాన్ , హేమలత, నిర్మల, దాసర్లపల్లి హేమలతలను సన్మానించారు.

సర్వే సమస్యలు పరిష్కరించండి

మదనపల్లె : మండంలోని అన్ని పంచాయతీల్లో ప్రజలు సర్వే సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారని, సమస్య పరిష్కారం దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వశాఖలకు చెందిన అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతిని, అమలుచేస్తున్న పథకాలు, జరిగిన అభివృద్ధి పనులను సమావేశంలో సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రెడ్డెమ్మ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, పెద్దమొత్తంలో నిధులు ఖర్చుచేస్తున్నారన్నారు. మండలంలో ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు 32,000 కుటుంబాలకు 15,430 కార్డులు తొలివిడతలో వచ్చాయన్నారు. జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ మండలపరిషత్ ఆధ్వర్యంలో వర్క్స్, ఫైనాన్స్ కమిటీల ఏర్పాటుపై ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, వైస్ ఎంపీపీలు డిష్‌రమణ, నందినితాజ్, సర్పంచ్‌లు దండుకరుణాకర్‌రెడ్డి, శరత్‌రెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

పేద ప్రజల గుండెచప్పుడు వైఎస్సార్ సీపీ

ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మదనపల్లె : వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



వాల్మీకిపురం : కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చింతల

మదనపల్లె : మహానేత వైఎస్సార్ ఆశయసాధనలో పురుడుపోసుకుని, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నో కుట్రలను ఛేదించి, చరిత్ర చూడని విజయాలను సొంతం చేసుకున్న వైఎస్సార్ సీపీ పేదప్రజల గుండెచప్పుడుగా మారిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్సార్ సీపీ 13 వసంతాలు పూర్తిచేసుకుని, 14వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా పట్టణంలోని సొసైటీకాలనీ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జెండాను ఎగురవేశారు. అనంతరం మండలంలోని తట్టివారిపల్లెలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు హోరెత్తించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, ఎంపీపీ రెడ్డెమ్మ, వెలుగుచంద్ర, మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ సిద్దలదీపా, వైఎస్సార్ సీపీ నాయకులు వేమారెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, మయూరిరఘునాథరెడ్డి, చిప్పిలిజగన్నాథరెడ్డి, బోనాసిజాన్‌బాబు, మునిశేఖర్, బావాజీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షేమ సారథి జగన్

వాల్మీకిపురం : ప్రజా రంజక పాలన, సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతటి ప్రయోజనకరమో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తన పాలన ద్వారా చూపించి సంక్షేమ రథ సారథిగా నిలిచారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి, కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు శ్రీధర్‌రాయల్, శంకర, రఘు, ఆనంద, రాయుడు, షాహెద్, రెడ్డెప్పరెడ్డి, నాగరాజ, ముని, శివ, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

పెద్దమండ్యం : పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ అన్నారు. పెద్దమండ్యంలో మంగళవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండు కూడలిలో పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె రామక్రిష్ణ, సర్పంచ్ జింకా విశ్వనాథ, ఎంపీటీసీ మంచూరి జయరాం, మండల కన్వీనర్ మొఘల్ చాంద్‌బాషా, మాజీ సర్పంచ్ నజీర్ అహ్మద్, చిన్నప్ప, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కురబలకోట : అంగళ్లు కూడలిలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ కన్వీనర్ కోళ్ల వాసు దేవరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ బి. దస్తగిరి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు బైసాని చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కోట్లాది జన కెరటంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భవించిందన్నారు. డీఆర్ ఉమాపతిరెడ్డి, సర్పంచులు పోరెడ్డి విశ్వారెడ్డి, ఆర్కే కృష్ణారెడ్డి, ఆర్బీ ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : మండల కేంద్రం వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కరీమ్, కో-ఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, నాయకులు నరేంద్రరెడ్డి, రమణారెడ్డి, తాళ్ల చంద్రశేఖర్, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.